సాక్షి
విశాఖపట్నం
గురువారం : 26 : జూన్ : 2025


ఆధునిక విధానాలతో
విపత్తుల నిర్వహణ 8లో


ఆసక్తికరంగా
కోస్ట్‌గార్డ్ మాక్ డ్రిల్ 8లో


రేపు నగరంలో
ట్రాఫిక్ ఆంక్షలు 8లో

వైజాగ్ టు చైనా

అక్రమంగా రేషన్ బియ్యం రవాణా

- రైస్ వైన్‌లో బియ్యాన్ని వినియోగిస్తున్న చైనా
- అక్కడి డిమాండ్‌ను సొమ్ముచేసుకుంటున్న మాఫియా
- రేషన్ షాపుల ఏర్పాటుతో చెలరేగిపోతున్న ముఠా
- తాజా దాడుల్లో 473 టన్నుల బియ్యం పట్టివేత
- కీలక సూత్రధారి టీడీపీ కార్గో వ్యాపారే..!
- రేషన్ బియ్యం కాదంటూ ల్యాబ్ నివేదికలు?





సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

రాష్ట్రంలోని రేషన్ బియ్యం విశాఖ నుంచి చైనాకు ఎగుమతి అవుతోంది. చైనాలో రైస్ వైన్‌గా పిలిచే సంప్రదాయ మద్యపానీయం హువాంగ్జియు తయారీలో విరివిగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అక్కడి డిమాండ్‌కు అనుగుణంగా ఎగుమతి చేసేందుకు విశాఖలోని పలు షిప్పింగ్ కంపెనీలు రేషన్ బియ్యాన్ని మార్గంగా ఎంచుకున్నాయి. రేషన్ మాఫియా ద్వారా సేకరించి చైనాకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన 473 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని విశాఖలోని పలు కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్‌టీ)ల్లో ఈ నెల 23, 24 తేదీల్లో దాడులు చేసి పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందులో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ వద్ద 150 మెట్రిక్ టన్నుల బియ్యం, గేటు వే ఈస్ట్ ఇండియా సీఎఫ్‌టీలో 156 మెట్రిక్ టన్నులు, పంచవటి టోల్ గేట్ వద్ద 167 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గుర్తించినట్టు అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారమంతా ప్రధానంగా టీడీపీకి చెందిన కార్గో వ్యాపారే నడిపిస్తున్నట్టు విమర్శలున్నాయి. పట్టుకున్నవి రేషన్ బియ్యం కాదంటూ ల్యాబ్‌ల ద్వారా నివేదికలు తెచ్చుకునేందుకు వ్యవహారం నడుస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మొదటి దఫా ల్యాబ్ నివేదికల్లో రేషన్ బియ్యం కాదంటూ నివేదిక రాగా.. రెండో నివేదిక కూడా అదేవిధంగా వచ్చేలా వివిధ రకాల ఒత్తిళ్లు వస్తున్నట్టు తెలుస్తోంది. రెండో శాంపిల్‌పై వచ్చే ల్యాబ్ నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

ల్యాబ్ నివేదిక పేరుతో...!

పట్టుకున్న బియ్యం నమూనాలను ల్యాబ్‌కు పంపించామని.. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు. మరోవైపు మొదటి దాడుల్లో పట్టుకున్న 150 మెట్రిక్ టన్నుల బియ్యంలో పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపగా.. రేషన్ బియ్యం కాదని నివేదిక వచ్చినట్టు సమాచారం. ఇక మిగిలిన బియ్యం నమూనాల నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని అంటున్నారు. ఈ నివేదికలు కూడా రేషన్ బియ్యం కాదని వస్తాయా? అవునని వస్తాయా అనేది చూడాల్సి ఉంది. దాడుల్లో పట్టుకున్న బియ్యం అనుమానిత ప్రజా పంపిణీ బియ్యం అని స్పష్టంగా ప్రకటనల్లో పేర్కొన్న అధికారులు.. ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా రవాణా, నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొనడం విశేషం.

అంతా అమ్యామ్యాలే...!

కొన్నాళ్ల క్రితం కాకినాడ నుంచి బియ్యం ఎగుమతి చేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వం నానా హంగామా చేసింది. దీంతో సాధారణ బియ్యం ఎగుమతి కూడా అక్కడి నుంచి చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో అనేక మంది విశాఖ నుంచి ఎగుమతులకు తమ మకాం మార్చారు. రేషన్ బియ్యం మాఫియా కూడా వారితో పాటు విశాఖ నుంచి చైనాకు బియ్యం ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు రచించింది. తాజాగా రేషన్ డిపోలు కూడా ఏర్పాటు కావడంతో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. ప్రధానంగా భీమిలి నియోజకవర్గంలోని రేషన్ మిల్లులతో పాటు పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లోని రేషన్ మిల్లుల కేంద్రంగా ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారు. సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్కడ సన్న బియ్యంగా మలుస్తున్నారు. వివిధ దేశాల ఎగుమతులకు సంబంధించిన అన్ని అనుమతులను కస్టమ్ హౌస్ బ్రోకరేజీ సంస్థలు తీసుకుంటున్నాయి. అనంతరం కస్టమ్స్ నుంచి అనుమతులు పొందుతున్నాయి. తరువాత రేషన్ మిల్లుల నుంచి తీసుకొచ్చి విశాఖలో ఉన్న పలు కంటైనర్ టెర్మినల్ ఫ్రైట్ స్టేషన్ల (సీఎఫ్‌టీ)లో నిల్వ ఉంచి.. కంటైనర్ల ద్వారా ఎగుమతులు చేపడుతున్నారు. టీడీపీకి చెందిన కార్గో వ్యాపారి స్టేషన్ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేయాల్సిన అధికారులు.. కూడా ఈ రేషన్ మాఫియాతో చేతులు కలుపుతున్నారు. ఒక్క కంటైనర్ లోడ్ చేస్తే అధికారులకు రూ.50 వేల చొప్పున చెల్లింపులు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచిత్రమేమింటే గత ఏడాది డిసెంబర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు నిర్వహించిన గేట్ వే వద్ద ఈ రేషన్ బియ్యం పట్టుబడటం గమనార్హం.


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో సివిల్ సప్లయిస్ సిబ్బంది

చైనా డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకే...!

వాస్తవానికి చైనాలో సంప్రదాయ రైస్ వైన్‌కు డిమాండ్ ఉంది. చైనీస్ రైస్ వైన్ అని కూడా పిలువబడే హువాంగ్జియును ప్రధానంగా చైనాలోని జియాంగ్నాన్ ప్రాంతంలో ఉడికించిన బియ్యాన్ని పులియబెట్టడం ద్వారా తయారుచేస్తారు. దీనికి ఉండే ప్రత్యేకమైన రుచితో పాటు తక్కువ ఆల్కహాల్ (8 నుంచి 20) శాతం, మంచి పోషక విలువలు ఉండటంతో చైనీయులు ఎంతో ఇష్టంగా సేవిస్తారు. ఇందులో అమైనో ఆమ్లాలు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు ఉంటాయి. దీనికి 5 వేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగి ఉంది. ఈ నేపథ్యంలో చైనాలో ఉండే ఈ రైస్ వైన్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ దేశాల నుంచి బియ్యాన్ని ఆ దేశం దిగుమతి చేసుకుంటుంది. అక్కడి డిమాండ్ ఇక్కడి రేషన్ బియ్యం మాఫియాకు కలిసివస్తోంది. ఇక్కడి నుంచి భారీగా రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేయడంలో టీడీపీకి చెందిన కార్గో వ్యాపారి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

న్యూస్‌రీల్

జగన్‌తో జిల్లా నేతల భేటీ


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, సమన్వయకర్తలు తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాస రావు, వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ ప్రసాద్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో విశాఖకు చెందిన నేతలకు చోటు కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శులుగా మళ్ల దేవి విశాలాక్షి (విశాఖ ఉత్తర), బొండాళం పద్మావతి(భీమిలి), రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా యెల్లిపోగుల వరలక్ష్మిని నియమించారు. అలాగే రాష్ట్ర బూత్ కమిటీల వింగ్ ప్రధాన కార్యదర్శిగా రవికాంత్ శివలంక(భీమిలి), రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ జాయింట్ కార్యదర్శిగా దశమంతుల వేణుగోపాల్(విశాఖ దక్షిణ)లను నియమించారు.

హెచ్‌పీసీఎల్ రూ.8.75 కోట్ల విరాళం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

మహారాణిపేట: జిల్లాలో పలు అభివృద్ధి పనులు, అగ్నిమాపక వాహనాల కొనుగోలు నిమిత్తం హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) సంస్థ జిల్లా యంత్రాంగానికి రూ. 8.75 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రభుత్వ విప్ గణబాబు, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ల సమక్షంలో సంస్థ ప్రతినిధులు ఈ మేరకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గుల్లలపాలెం, రామానగర్‌లలో డ్రెయిన్లు నిర్మించేందుకు జీవీఎంసీకి రూ.8 కోట్లు అందించారు. ఆధునిక సదుపాయాలు కలిగిన మూడు అగ్నిమాపక యంత్రాలను కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగానికి రూ.75 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రతినిధులకు విప్, కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. హెచ్ఆర్ సీజీఎం జి.కిరణ్ కుమార్, ఈడీ రామనాథన్ రామకృష్ణన్, పీఆర్వో కాళీ నర్సింహం పాల్గొన్నారు.

సింగపూర్ ప్రయాణికులకు శుభవార్త

విశాఖ సిటీ: విశాఖ నుంచి సింగపూర్ విమాన ప్రయాణికులకు శుభవార్త. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి సింగపూర్‌కు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో స్కూట్ విమానయాన సంస్థ సింగపూర్ ఫ్లైట్‌ను అప్‌గ్రేడ్ చేసింది. దీంతో సీట్ల సామర్థ్యం పెరిగింది. ఇప్పటి వరకు 180 సీట్లతో ఏ320సీఈఓ విమాన సర్వీసు అందుబాటులో ఉంది. దీని స్థానంలో బుధవారం నుంచి ఏ321ఎన్ఈఓ విమానాన్ని విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి సింగపూర్‌కు నడుపుతోంది. ఇందులో 236 సీట్లు ఉన్నాయి. ఫలితంగా విశాఖ-సింగపూర్ విమాన సర్వీస్‌లో మరో 56 మంది అధికంగా ప్రయాణించే వెసులుబాటు కలుగుతోంది.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ హౌరా వరకు పొడిగింపు

తాటిచెట్లపాలెం: షాలిమర్-చెన్నై సెంట్రల్-షాలిమర్ మధ్య నడుస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 25వ తేదీ నుంచి హౌరా వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్-చెన్నై సెంట్రల్(12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 25వ తేదీ మధ్యాహ్నం 3.10 గంటలకు హౌరా నుంచి బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో చెన్నై సెంట్రల్-(హౌరా) షాలిమర్(12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 25వ తేదీ నుండి హౌరా వరకు నడుస్తుంది. ఈ రైలు హౌరాకు ప్రతీ రోజు ఉదయం 11 గంటలకు చేరుకుంటుంది.

సమష్టి కృషితోనే విజయం సాధించాం

యోగాంధ్ర అభినందన సభలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్


కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సన్మానిస్తున్న డీసీపీ కృష్ణకాంత్ పటేల్

మహారాణిపేట: రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగం సమష్టి కృషి, ప్రజాప్రతినిధుల సహకారంతో యోగాంధ్ర విజయవంతమైందని, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించగలిగామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమ నిర్వహణలో అన్ని విభాగాల అధికారులు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. వారి సేవలను కొనియాడారు. పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు ప్రశంసనీయ పాత్ర పోషించాయన్నారు. జేసీ కె.మయూర్ అశోక్ రాముడికి లక్ష్మణుడిలా అండగా నిలిచారన్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తూ.. విలువైన సూచనలిచ్చారన్నారు. అనంతరం కలెక్టర్‌ను జిల్లా అధికారులు సత్కరించారు. డీసీపీ అజిత, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ(అడ్మిన్) కృష్ణకాంత్ పటేల్, డీఆర్వో భవానీ శంకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీజీ ఈసెట్‌లో విష్ణుకు ఫస్ట్ ర్యాంక్


విష్ణుప్రతాప్

తాటిచెట్లపాలెం: ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ పీజీ ఈసెట్)లో సీతమ్మధారకు చెందిన పి. విష్ణుప్రతాప్‌కు మొదటి ర్యాంకు లభించింది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో తనకు మొదటి ర్యాంకు లభించినట్లు విష్ణుప్రతాప్ తెలిపారు. అతని తండ్రి ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ కాగా తల్లి గృహిణి. పీజీ ఈసెట్‌లో మొదటి ర్యాంక్ వస్తుందని ఊహించలేదని, రీసెర్చ్ సైంటిస్ట్ కావాలన్నదే తన లక్ష్యమని విష్ణు తెలిపారు.

ముంచెత్తిన వర్షం

జనజీవనం అస్తవ్యస్తం









మహారాణిపేట: నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం వేకువజామున ఆరంభమైన వర్షం.. సాయంత్రం వరకు కురిసింది. దీంతో నగర జీవనం స్తంభించిపోయింది. కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన నగరవాసులకు ఈ వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. బుధవారం వేకువజాము నుంచే వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం వేళ విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడ్డారు. రోజువారీ వ్యాపారంపై ఆధారపడి జీవించే చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు వర్షం కారణంగా నష్టపోయారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజా



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

విశాఖ లీగల్: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవ ప్రాధికార సంస్థ అధ్యక్షుడు చెన్నం శెట్టి రాజా అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో రాష్ట్ర న్యాయ సేవ ప్రాధికార సంస్థ పిలుపు మేరకు బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 2015-2021 సంవత్సరాల మధ్య చిన్నారుల సామాజిక ఆర్థిక ఇతర కోణాలను పరిశీలించి, వారికి ఉత్తమ సేవ అందించడానికి కొత్త చట్టాలను తీసుకొచ్చారన్నారు. బాలల ఉత్తమ ప్రయోజనాలను గుర్తించి వారికి న్యాయపరమైన సేవలు అందించడానికి రెండు పథకాలు అమలు జరిపినట్లు చెప్పారు. న్యాయపరమైన రక్షణ, బాలల హక్కుల పరిరక్షణ ఈ సేవల్లో అంతర్భాగం అన్నారు. అన్ని విధాలైన ఆరోగ్య సేవలతో పాటు వినికిడి, శారీరక వైకల్యం వంటి అంశాలను పరిశీలించి తగిన విధంగా ఆదుకోవాలని చట్టం వివరిస్తున్నట్లు చెప్పారు. బాలల ఆనందమయ జీవితానికి కొత్త చట్టాలు ఎంతో ఉపకరిస్తాయని విశాఖ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రామలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య విద్యాధికారి కె.నాగేశ్వరరావు, కార్మిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.సునీత, జిల్లా బాలల సంక్షేమ శాఖ పీడీ ఎంఆర్ఎల్ రాధా, జీవీఎంసీ అధికారులు, అన్ని మండలాల అధికారులు, అనాథాశ్రమాల ప్రతినిధులు, నిరాశ్రయుల సేవా సంస్థల ప్రతినిధులు, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన అధికారులు, దృశ్య శ్రావణ మాధ్యమం ద్వారా పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో ప్రథమ స్థానంలో నిలపాలి

జెడ్పీ సీఈవో నారాయణమూర్తి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్-2025లో భాగంగా మెరుగైన పారిశుద్ధ్యం కోసం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానానికి తీసుకువెళ్లడానికి అందరి సహకారం అవసరమన్నారు. గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ బృందాలు పర్యటించి, కేటగిరీల వారీగా పరిశీలించి మార్కులు వేస్తాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.శ్రీనివాసరావు, జిల్లా రూరల్ వాటర్ సప్లై సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.వి.వి.చౌదరి, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం ప్రభుత్వ పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. సుమారు 10 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఐటీఐ(అన్ని ట్రేడులు) పాసైన అభ్యర్థులు అర్హులు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణపత్రాలతో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ముడిసరకు లేకుండానే మూడో ఫర్నేసా..


స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్-3

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడో బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్-3)ను ఈ నెల 27న పునఃప్రారంభించేందుకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా బీఎఫ్-3ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. బీఎఫ్-3ని ప్రారంభించాలనుకోవడం మంచి విషయమే.. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిర్ణయంపై పరిశ్రమ వర్గాల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇప్పుడీ విషయం చర్చనీయాంశంగా మారింది.

- మూడో బ్లాస్ట్ ఫర్నేస్ చుట్టూ సందేహాలు
- సరిపడినంత ముడిసరకు లేదంటున్న కంపెనీ వర్గాలు
- సింటర్, బ్యాటరీల సామర్థ్యం సరిపోదంటున్న ఉద్యోగులు
- స్టీల్‌ను రోల్ చేయగలిగే సామర్థ్యంపైనా అనుమానాలు
- కంపెనీపై ఆర్థిక భారం పెరుగుతుందంటున్న కార్మికవర్గం

గాజువాక : గతంలో ఒకసారి బీఎఫ్-3ని ప్రారంభించినా, కేవలం రెండు నెలలకే ముడిసరకు కొరత కారణంగా మూసివేయాల్సి వచ్చింది. ఆ అనుభవాల దృష్ట్యా తగినన్ని ముడిసరకు నిల్వలు లేకుండానే మళ్లీ ఫర్నేస్‌ను ప్రారంభించాలని తాజాగా నిర్ణయించడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్లను బ్యాంకుల అప్పులు తీర్చడానికే వినియోగించి స్టీల్ ఉత్పత్తికి అవసరమైన ముడి సరకు సమకూర్చలేదు. స్టీల్‌ప్లాంట్ లాంటి ఇంటిగ్రేటెడ్ పరిశ్రమలో కనీసం 45 రోజులకు సరిపడా ముడి సరకు నిల్వలు ఉండాలని నిపుణులు చెబుతున్నారు. మూడు నెలలకు సరిపడా ముడి సరకును సమకూర్చిన తర్వాతే బీఎఫ్-3ను ప్రారంభిస్తామని గతంలో స్టీల్ జాయింట్ సెక్రటరీ ప్రకటించారు. కానీ ప్రస్తుతం ప్లాంట్‌కు అవసరమైన ముడిసరకు అందుబాటులో లేదని కంపెనీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫర్నేస్‌ను ప్రారంభిస్తే ప్లాంట్ నష్టాల బారిన పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కూలింగ్ ప్లేట్ల సమస్య.. అదనపు భారం

గతంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా బీఎఫ్-3ని ప్రారంభించి, ఆ తర్వాత మూసివేశారు. ఈ కారణంగా ఫర్నేస్‌లోని కీలకమైన కూలింగ్ ప్లేట్లు దెబ్బతిన్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీని వల్ల కూడా స్టీల్ ఉత్పత్తిలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. విదేశాల నుంచి దిగుమతి **చేసుకోవాల్సిన ఈ ప్లేట్ల కోసం ప్లాంట్ యాజమాన్యం అదనంగా ఖర్చు చేసింది. ఇతర దేశాల నుంచి కూలింగ్ ప్లేట్లు ఇక్కడికి చేరాలంటే సుమారు రెండు నెలల సమయం పడుతుంది. కానీ అత్యవసరంగా వాయు రవాణా ద్వారా తెప్పించడం వల్ల** ప్లాంట్‌పై అదనపు ఆర్థిక భారం పడిందని కార్మిక వర్గాలు చెబుతున్నాయి. గతంలో జరిగిన అనుభవం నుంచి పాఠాన్ని తీసుకోని ప్రభుత్వం బీఎఫ్-3ని పునఃప్రారంభించాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు చెబుతున్నారు.

సామర్థ్యంపై సందేహాలు

సింటర్ ప్లాంట్

బీఎఫ్-3 సమర్థంగా పని చేయాలంటే సింటర్ ప్లాంట్‌లో తగినంత సింటర్ అందుబాటులో ఉండాలి. ఇక్కడ ప్రస్తుతం మూడు మిషన్లు అందుబాటులో ఉన్నాయి. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ సమర్థంగా పని చేయాలంటే అదనంగా మరో సింటర్ మిషన్ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మిషన్లను పూర్తిస్థాయిలో వాడితే మూడు మిషన్లు సరిపోతాయని యాజమాన్యం చెబుతోంది. అయితే ఏ చిన్నపాటి సాంకేతిక సమస్య వచ్చినా ఉత్పత్తిని ఆపుకోవాల్సి వస్తుందని, అందువల్ల నాలుగో సింటర్ మిషన్ అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

కోక్ ఒవెన్

కోక్ ఒవెన్ విభాగంలో ఆరో బ్యాటరీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది లేకపోవడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి నష్టాలు వస్తాయని అంచనా. ప్రస్తుతం దీన్ని ఏర్పాటు చేయడం సాధ్యం కానందున, దీని నిర్వహణను ప్రైవేట్‌కు అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

పెల్లెట్స్

ఉత్పత్తిలో కీలకమైన పెల్లెట్లను బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల ఒక్కో టన్ను ఉత్పత్తికి రూ.4,000 అధిక ఖర్చు అవుతోందని లెక్కలు చెబుతున్నాయి. ఇది కూడా ప్లాంట్‌పై అదనపు భారమే.

రోలింగ్ మిల్స్

ప్రస్తుతం ప్లాంట్‌లో 5.5 మిలియన్ టన్నుల స్టీల్‌ను మాత్రమే రోల్ చేయగలిగే సామర్థ్యం ఉంది. బీఎఫ్-3 ప్రారంభమైతే ఉత్పత్తి 7.5 మిలియన్ టన్నులకు చేరుతుంది. ఆ అదనపు స్టీల్‌ను రోల్ చేసే సామర్థ్యం ఎక్కడి నుంచి వస్తుందనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఇన్ని సవాళ్ల మధ్య బీఎఫ్-3ని పునఃప్రారంభించి, దాన్ని సమర్థంగా నిర్వహించగల సత్తా యాజమాన్యానికి ఉందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా, ప్లాంట్‌కు అవసరమైన సొంత గనులను కేటాయించాలని నిపుణులు, కార్మికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. లేదా సెయిల్‌లో ఈ ప్లాంట్‌ను విలీనం చేస్తే కొంతమేరకైనా పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

కోస్ట్‌గార్డ్ మాక్ డ్రిల్

విశాఖ సిటీ: సముద్రంలో చమురు కాలుష్యాన్ని నిరోధించేందుకు ఇండియన్ కోస్ట్‌గార్డ్ ప్రధాన కార్యాలయంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. నౌకల ప్రమాదాలు, ఇతర కారణాలతో చమురు లీకై సముద్రంలో కలిసిన సమయంలో చేపట్టాల్సిన చర్యలను ప్రదర్శించారు. సముద్రంపై తేలియాడే కృత్రిమ గోడను నిర్మించి చమురు విస్తరణను శోధించారు. స్కిమర్ అనే పరికరం ద్వారా సముద్రంలో ఆయిల్‌ను సేకరించి పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌లో ఉన్న ట్యాంకుల్లో నింపారు. దాన్ని తీర ప్రాంతానికి తరలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు పాల్గొన్నాయి.

కమిషనర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు



కమిషనర్‌ను సత్కరిస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను మహా విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయాన్ని కమిషనర్ వద్ద ప్రస్తావించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పీవీపీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు గుర్రం సింహాచలం, నిర్వాహక కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి బూటు కృష్ణ, కె.అప్పలనాయుడు, కోశాధికారి శ్రీనివాసరావు, సహాయ కోశాధికారి ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ఆరిలోవ: విశాఖ, అనకాపల్లి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీకి సంబంధించి శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆయా గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. తొలుత ఈ పరీక్ష కోసం అన్ని తరగతులకు 589 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష సమయంలో మరికొందరు విద్యార్థులు దరఖాస్తులతో చేరుకోవడంతో.. అధికారులు వారికి కూడా అవకాశం కల్పించారు. దీంతో మొత్తం 647 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు.

ఆధునిక విధానాలతో విపత్తుల నిర్వహణ



సమావేశం అనంతరం అన్ని శాఖల అధికారులతో ప్రాధికార సంస్థ ప్రతినిధులు

మహారాణిపేట: 'ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. భవిష్యత్ అవసరాలు, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పాత విధానాలను నవీకరించాలి.' అని జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) ప్రతినిధులు నావల్ ప్రకాష్, అభిషేక్ బిశ్వాస్, అభినవ్ వాలియా అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనం కోసం విశాఖకు విచ్చేసిన వీరు.. ముందుగా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను తన చాంబర్‌లో కలిశారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా సమగ్ర ప్రణాళికలు, విపత్తుల నిర్వహణలో అంతర్ జిల్లాల సహకారం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టరేట్ మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విపత్తుల నిర్వహణలో జపాన్ అనుసరించిన సాండియా ఫ్రేమ్‌వర్క్, ప్రధాన మంత్రి పది సూత్రాల అజెండా, డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించాల్సిన విధానాలపై సమీక్షించారు. ఎన్‌డీఎంఏ రూపొందించిన పీపీటీని ప్రజెంట్ చేసి, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా సంస్థ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ మాట్లాడుతూ జిల్లా ప్రణాళికలను ఆధునికీకరించాలని సూచించారు. విపత్తుల నిర్వహణలో సాచేత్ యాప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ వ్యవస్థలను వినియోగించుకోవాలని చెప్పారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అంతర్ జిల్లాలు పరస్పరం సహకరించుకోవాలని హితవు పలికారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను సందర్శించాలని, భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. సాచేత్ యాప్‌ను వినియోగించడం ద్వారా ప్రమాద హెచ్చరికలను మెసేజ్‌ల రూపంలో పొందవచ్చన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉండే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బెటాలియన్ల సంఖ్యను పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. దేశంలోనే మొదటిగా జాతీయ సైక్లోన్ మిటిగేషన్ కేంద్రాన్ని ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో నెలకొల్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖ లాంటి ప్రాంతంలో అన్ని రకాల విపత్తులు సంభవించడానికి ఆస్కారం ఉందని, అన్ని రకాలుగా ప్రణాళికలు రూపొందించుకొని సన్నద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సమావేశంలో ఎస్డీఎంఏ ప్రతినిధి సీహెచ్ పీటర్, డీపీఎం రాము, సివిల్ డిఫెన్స్ అధికారి మధుసూదన్ రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో ఇద్దరు ఆర్టీసీ సిబ్బంది అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు

ఎంవీపీకాలనీ : ఆర్టీసీ బస్సులో ఈ నెల 22న జరిగిన చోరీకి సంబంధించి ఆ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎంవీపీ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ద్వారకా క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాధవధార సచివాలయం ఉద్యోగి కమలకుమారి (55) ఈ నెల 22న ఫంక్షన్ నిమిత్తం విజయవాడ వెళ్లి తిరిగి వస్తూ బస్సులో బ్యాగ్ మర్చిపోయారు. తన తమ్ముడి ఇంటికి వెళ్లే క్రమంలో ఆమె గాజువాకలో బస్సు దిగిపోయారు. అనంతరం ఇంటికి వెళ్లాక చూసుకోగా తన బ్యాగ్ కనిపించలేదు. దీంతో మద్దిలపాలెం ఆర్టీసీ డిపోకు వెళ్లి చూడగా బ్యాగ్ ఉన్నప్పటికీ అందులోని 3 బంగారు గొలుసులు, 2 గాజులు, రూ.50,000 నగదు కనిపించలేదు. దీంతో ఆమె ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ద్వారకా క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధర్‌రావు ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించిన ఎంవీపీ క్రైమ్ ఎస్‌ఐ అప్పలరాజు మద్దిలపాలెం ఆర్టీసీ డిపో కాంట్రాక్ట్ హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మొల్లి వెంకటేష్, సూపర్‌వైజర్ భరటం వెంకటరమణలను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి బంగారు అభరణాలతో పాటు రూ.50 వేలు నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ చక్రధర్‌రావు, ఎస్‌ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కనెక్ట్ ఏపీ ఎక్స్‌పో టెక్ సెమినార్



మాట్లాడుతున్న బండారు కృష్ణమూర్తి

దాబాగార్డెన్స్: విశాఖలో ఈనెల 27 నుంచి 29 వరకు కనెక్ట్ ఏపీ ఎక్స్‌పో టెక్ 4వ సెమినార్ నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు బండారు కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సెమినార్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లాసన్స్ బే కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో జరగనున్న ఈ సెమినార్‌ను కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ ప్రొవైడర్స్, డిజిటల్ మార్కెటింగ్ ప్రతినిధులు, డిజిటల్ సాంకేతిక రంగ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఇది మంచి వేదిక కానుందన్నారు. ప్రపంచ దేశాల్లో మారుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీకి సంబంధించి, ప్రతి ఒక్క పరికరం వినియోగదారులకు ఈ ఎక్స్‌పోలో లభ్యం కానుందని, ప్రముఖ కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయన్నారు. సమావేశంలో కేబుల్ ఆపరేటర్లు సుభద్రరాజు, గుంటూరు ప్రసాద్, చింతాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాకు 'ఎన్‌పీసీఐ' తప్పనిసరి

ఎంవీపీకాలనీ: తల్లికి వందనం పథకంలో భాగంగా 9, 10 తరగతులతో పాటు ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల(ఎస్సీ) విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో పాటు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) అనుసంధానం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ సూచించింది. ఈ మేరకు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి విద్యార్థికి బ్యాంకు లేదా పోస్టల్ ఖాతా తప్పనిసరి అని, ఆయా ఖాతాలకు ఆధార్, ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలి. ఈ సేవలను పొందడానికి గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను లేదా పోస్టల్ కార్యాలయాలను, ఆయా బ్యాంకులను సంప్రదించవచ్చు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రం వారి తల్లుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయని డీడీ వివరించారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం(0891-2551001), లోక్‌నాథ్ (డీపీఎంయూ- (86395 98237)ను సంప్రదించవచ్చు.

ఓషన్ ఫోరంలో వక్తగా విశాఖ యువకుడు

విశాఖ స్పోర్ట్స్: విశాఖపట్నానికి చెందిన భవేష్ జైన్ తైవాన్ ఇంటర్నేషనల్ ఫోరంలో భారతదేశ యువ ప్రతినిధిగా పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమం జూలై 2, 3 తేదీల్లో తైవాన్‌లోని తైపీ నగరంలో జరగనుంది. మహా సముద్ర వ్యవహారాల మండలి 'సముద్ర భద్రత–నీలి ఆర్థిక వ్యవస్థ' అనే ఇతివృత్తంపై ఈ ఫోరంను నిర్వహిస్తోంది. ఇందులో 'యువతరం సామరస్యపూర్వక, స్థిరమైన భవిష్యత్తుకు కీలకం' అనే శీర్షికతో జరిగే సెషన్‌లో భవేష్ జైన్ వక్తగా ప్రసంగించనున్నాడు.

రేపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

రథయాత్రకు ఏర్పాట్లు

విశాఖ సిటీ: జగన్నాథ రథయాత్రలకు విశాఖ నగరం ముస్తాబైంది. ఈ నెల 27 మధ్యాహ్నం 3 గంటల నుంచి దేవదాయ శాఖ, ఇస్కాన్, హరేకృష్ణ మూవ్‌మెంట్, తదితర సంస్థల ఆధ్వర్యంలో రథయాత్రలు ప్రారంభమవుతాయి. నగరంలో పలు ప్రాంతాల్లో జరిగే ఈ వేడుకల్లో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశముంది. దీంతో పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు సూచనలు చేశారు.

- టౌన్ కొత్త రోడ్డులో జరిగే రథయాత్రకు సుమారు 10 వేల మందికి భక్తులు హాజరయ్యే అవకాశముంది. ఈ యాత్ర టౌన్ కొత్త రోడ్డు నుంచి ప్రారంభమై టర్నర్ చౌల్ట్రీ వరకు సాగుతుంది. ఆ సమయంలో జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వైపు వచ్చే వాహనాలు చౌల్ట్రీ వద్ద కుడి వైపునకు తిరిగి డాల్ఫిన్ జంక్షన్, సీహార్స్ జంక్షన్, గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా పాత పోస్టాఫీస్‌కు చేరుకోవాలి.
- కలెక్టర్ ఆఫీస్, జిల్లా పరిషత్, ఆర్‌కే బీచ్ నుంచి గాజువాక వైపు(99) వెళ్లే బస్సులు వాచ్ హౌస్ జంక్షన్, జగదాంబ జంక్షన్, చిత్రాలయ రోడ్, లీలామహల్ జంక్షన్, డాల్ఫిన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగే యాత్రకు సుమారు 5 వేల మంది భక్తులు జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మ వద్దకు చేరుకుని.. అక్కడ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్, అంబేడ్కర్ సర్కిల్, డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్, సెవెన్ హిల్స్, పటేల్ జంక్షన్ మీదుగా గురజాడ కళాక్షేత్రానికి చేరుకుంటారు.
- ఆ సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూర్ణామార్కెట్ వెళ్లే బస్సులు గొల్లలపాలెం జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం, హరిత జంక్షన్, కులాసా బార్, బౌడరా రోడ్ సీ హార్స్ జంక్షన్, గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా పాతపోస్టాఫీస్‌కు చేరుకోవాలి.
- సుమారు 3 వేల మంది భక్తులు జగదాంబ జంక్షన్ నుంచి బయలుదేరి డాబాగార్డెన్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్, ఎల్ఐసీ బిల్డింగ్, గుడివాడ గురునాధరావు జంక్షన్ మీదుగా జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంటారు.
- ఆ సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ ఆఫీస్, జిల్లా పరిషత్, ఆర్‌కే బీచ్ వెళ్లే బస్సులు గొల్లలపాలెం, సెవెన్ హిల్స్, గ్రీన్ పార్క్, వార్త రోడ్, తెన్నేటి జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.
- అలాగే జగదాంబ జంక్షన్ నుంచి మరో 3 వేల మంది భక్తులు బయలుదేరి వార్త రోడ్డు, సెవెన్ హిల్స్, పటేల్ జంక్షన్ మీదుగా గురజాడ కళాక్షేత్రానికి చేరుకుంటారు. ఆ సమయంలో జగదాంబ జంక్షన్, సెవెన్ హిల్స్ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.
- జిల్లా పరిషత్ వద్ద ఉన్న కృష్ణ మందిర్‌కు సుమారు 3 వేల మంది భక్తులు బీచ్ రోడ్డులోని కాళీమాత గుడి నుంచి బయలుదేరి నోవాటెల్, ఎన్‌సీబీ, కలెక్టరేట్ మీదుగా చేరుకుంటారు. ఆ సమయంలో ఆర్‌కే బీచ్ నుంచి జిల్లా పరిషత్‌కు జగన్నాథ స్వామి రథం వచ్చే సమయంలో అవసరం మేరకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బస్సులను కలెక్టర్ ఆఫీస్ వద్దే ఆపి.. తిరిగి వెనక్కి పంపించనున్నారు.
- దసపల్లా హిల్స్ వద్ద గల పూరీ జగన్నాథ స్వామి ఆలయం నుంచి సుమారు 5 వేల మంది భక్తులు బయలుదేరి సీఆర్ రెడ్డి సర్కిల్, చినవాల్తేరు, పార్క్ హోటల్ జంక్షన్ మీదుగా లాసెన్స్ బే కాలనీ వద్దకు చేరుకుంటారు. ఈ సమయంలో సీఆర్ రెడ్డి సర్కిల్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.
- ఏఎస్‌రాజా కాలేజ్ రోడ్డు నుంచి సుమారు 500 మంది భక్తులు టీటీడీ సర్కిల్, ఎంవీపీ డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, క్యాన్సర్ హాస్పిటల్, వాసవానిపాలెం మీదుగా ఏఎస్ రాజా కాలేజ్‌కు చేరుకుంటారు.
- అగనంపూడి నుంచి సుమారు 15 వేల మంది భక్తులు శనివాడ జంక్షన్ నుంచి బయలుదేరి హైవే మీదుగా అగనంపూడి గ్రామానికి చేరుకుంటారు. ఈ సమయంలో శివాలయం జంక్షన్ వద్ద వాహనాలను మళ్లింపు ఉంటుంది.
- ఉక్కు నగరం లోపల సుమారు 5 వేల మంది భక్తులు రథయాత్ర నిర్వహించనున్నారు.
- న్యూపోర్ట్ ఏరియాలో సుమారు 2 వేల మంది భక్తులు హెచ్‌బీ కాలనీ నుంచి బయలుదేరి రైతు బజార్ జంక్షన్, ప్రభుత్వ ఆస్పత్రి, పాత అయ్యన్నపాలెం మీదుగా పెద్ద కోరాడ, పెంటమాంబా టెంపుల్ మీదుగా మళ్లీ హెచ్‌బీ కాలనీకి చేరుకుంటారు.
- రథయాత్రలు జరిగే సమయాల్లో ఆయా ప్రాంతాల్లో సాధారణ వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి బుధవారం కూడా పాలిసెట్ కౌన్సెలింగ్ జరిగింది. వర్షం పడుతున్నప్పటికీ.. ఇబ్బందులు పడుతూనే విద్యార్థులు అత్యధిక సంఖ్యలో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

- గైస్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 68,001 నుంచి 77,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 250 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.
- పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో, జనరల్ హెడ్, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పీఎం భాషా, లెక్చరర్ నాగరాజుతో కూడిన అధికారుల బృందం 77,001 నుంచి 86,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించింది. 298 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించింది. వీరిలో 209 మంది బీసీ, 37 మంది ఓసీ, 39 మంది ఎస్సీ, 13 మంది ఎస్టీ విద్యార్థులు ఉన్నారు.
- గురువారం గైస్ కళాశాలలో 86,001 నుంచి 95,000 ర్యాంకు వరకు, పాలిటెక్నిక్ కళాశాలలో 95,001 నుంచి 1,04,000 ర్యాంకు వరకు విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఎస్టీ విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావాలి.

వెబ్ ఆప్షన్ల ఎంపిక వాయిదా

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన వెబ్ ఆప్షన్ల ఎంపిక వాయిదా పడింది. వాస్తవానికి ఈ నెల 27 నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభం కావాల్సి ఉంది. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 30 వరకు వెబ్ ఆప్షన్లు నిర్వహించి, జూలై 1న ఆప్షన్ల మార్పిడి, 3న సీట్ల కేటాయింపు జరగాల్సి ఉంది. అయితే ఆప్షన్ల ఎంపికను ఈ నెల 30కి వాయిదా వేశారు. ఇందుకు సంబంధించి ర్యాంకుల వారీగా కొత్త షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది.

సామాజిక కార్యక్రమాలతో గ్రంధి మనోజ్ జయంతి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రవిరాజ్

విశాఖ సిటీ: మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యుయలర్స్ లిమిటెడ్(వైభవ్ జ్యుయలర్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు మనోజ్‌కుమార్ గ్రంధి 59వ జయంతి సందర్భంగా పలు సంక్షేమ, సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 100 మందికి పైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. ఓమ్నీ ఆర్‌కే ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి, మాక్సీ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐ క్యాంప్‌లో 100 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వైస్‌చాన్సలర్ డాక్టర్ రవిరాజ్, గైనకాలజిస్ట్ డాక్టర్ రాధ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ భారత మల్లికా రత్నకుమారి గ్రంధి, సంస్థ హోల్‌టైమ్ డైరెక్టర్ అండ్ సీఎఫ్‌ఓ సాయి కీర్తన, సీఓఓ రఘాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, కంకటాల టెక్స్‌టైల్స్ సంస్థ చైర్మన్ మల్లిక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నీరుగారిపోయిన ఎంటీఎస్ టీచర్ల ఆందోళన

వేకువజాము వరకు బదిలీల కౌన్సెలింగ్

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ గురువారం వేకువజాము వరకు కొనసాగింది. బదిలీల విధానంపై అసంతృప్తితో మూడు రోజులుగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయుల ప్రయత్నాలు ఫలించలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 1998, 2008 డీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన 425 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు బదిలీల విషయంలో తలెత్తిన సమస్యలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడతామని హెచ్చరించినా, వారి ఆందోళన నీరుగారిపోయింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, విశాఖ ఎంపీ శ్రీభరత్, స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో ఉపాధ్యాయులు మొదట కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. అయితే మూడో రోజుకు వచ్చే సరికి ఆందోళన చల్లబడిపోయింది. కొందరు ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసనను వీడి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. దీంతో మిగిలిన వారు కూడా ఆందోళనను విరమించారు. మంగళవారం 41 మందికి, బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు మరో 146 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఎంత సమయమైనా సరే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. దీంతో గురువారం తెల్లవారుజాము వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: పదేళ్ల బాలికపై అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె.మంగాకుమారి బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. బాలికకు రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ అందించిన వివరాలివి. పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామం దిగువ రెల్లి వీధికి చెందిన నిందితుడు బంగారు ఈశ్వరరావు పశువుల్ని మేపు కుంటూ జీవనం సాగించేవాడు. ఫిర్యాదికి ఇద్దరు ఆడపిల్లలు. బాధితురాలు ఫిర్యాదుకి పెద్ద కుమార్తె. 5వ తరగతి చదువుకునేది. 2018 జూన్ 9వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఇంటి సమీపంలోని శిరిగిడివారి మామిడి తోటలోకి ఆవులను మేపడానికి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న నిందితుడు ఈశ్వరరావు బాలికను చేరదీసి ఆమెపై లైంగిక దాడి చేశాడు. బాధితురాలు తీవ్ర రక్తస్రావం, గాయాల మధ్య ఏడ్చుకుంటూ ఇంటి వైపు వస్తుండగా ఆమె నాన్నమ్మ చూసింది. బాలికను వాళ్ల ఇంటికి తీసుకువెళ్లి ఆమె తల్లికి జరిగిన విషయం చెప్పింది. బాధితురాలు తల్లి అదే రోజు సాయంత్రం పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి డీఎస్పీ పి.బి.ఎస్ నాగేశ్వరరావు నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరిపారు. నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

అంత్యక్రియలను అడ్డుకున్న పోలీసులు

కూర్మన్నపాలెం: యాదవజగ్గరాజుపేటలో ఒక యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశం కావడంతో పోలీసులు రంగంలోకి దిగి అంత్యక్రియలను అడ్డుకున్నారు. వివరాలివి.. యాదవజగ్గరాజుపేటకు చెందిన ఒమ్మి దుర్గారావు కుమార్తె లావణ్య(20) బుధవారం మరణించగా, కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించారు. అయితే ఒక వ్యక్తి.. ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని దువ్వాడ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు హుటాహుటిన జగ్గరాజుపేటకు చేరుకుని అంత్యక్రియలను అడ్డుకున్నారు. యువతి మృతిపై పోలీసులు ఆరా తీయగా, లావణ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు తలనొప్పి, కడుపునొప్పి వంటి బాధలు ఉండేవని, వాటికి మందులు వాడుతోందని వివరించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మల్లేశ్వరరావు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన నాయకుల నుంచి కాపాడండి

- అధికార బలంతో తమ ప్లాట్లను దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు
- తాము ఎమ్మెల్యే పంచకర్ల మనుషులం అంటూ బెదిరిస్తున్నారు
- పెదగాడిలో జనచైతన్య ప్లాట్ల ఓనర్ల అసోసియేషన్ ప్రతినిధుల వేడుకోలు



జనసేన నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పెదగాడిలోని లేఅవుట్ ప్లాట్ల యజమానులు

పెందుర్తి: 'మేం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తాలూకా.. ఈ ప్లాట్లు మావి.. మీరు ఎప్పుడు కొనుక్కున్నారో.. ఎలా కొనుక్కున్నారో మాకు అనవసరం.. ఇప్పుడు మేం అధికారంలో ఉన్నాం.. మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటామంటూ' పెదగాడిలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అనుచరులు, జనసేన నాయకులు తీవ్రస్థాయిలో బెదిరిస్తున్నారంటూ పెదగాడిలోని జనచైతన్య లేఅవుట్ ప్లాట్ల ఓనర్ల అసోషియేషన్ ప్రతినిధులు వాపోయారు. తమను, తమ ప్లాట్లను అధికారులే కాపాడాలని విన్నవించారు. పెందుర్తి మండలం పెదగాడిలో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1993లో జనచైతన్య రియల్ ఎస్టేట్ సంస్థ పెదగాడిలో 47 ఎకరాల్లో లేఅవుట్ వేయగా అందులో 475 ప్లాట్లు తమతో పాటు పలువురు కొనుగోలు చేశారని చెప్పారు. దాదాపు 30 ఏళ్ల పాటు తమ క్రయ, స్వాధీనానుభవంలో ఉన్న ప్లాట్లను తమవి అంటూ స్థానిక జనసేన నాయకులు గత రెండు మూడు రోజులుగా దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు చూస్తున్నారన్నారు. తమ తాత ముత్తాతల భూములు కొనడానికి మీరెవరు అంటూ దాడులకు పాల్పడుతున్నారంటూ వాపోయారు. మాకు ఎమ్మెల్యే ఉన్నారు.. ప్రభుత్వం ఉంది ఏదైనా చేస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. తమకు జిల్లా ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విన్నవించారు.

నిలిచిన బోటు షికారు



కొమ్మాది: వాతావరణ మార్పులతో సముద్రంలో అలలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి. ఈ కారణంగా రుషికొండ బీచ్‌లో తాత్కాలికంగా బోటు షికారును నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత బోటు షికారు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

సెల్ఫీ ఫీట్లు



కొంత మంది యువత సెల్ఫీ మోజులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వరుస సంఘటనలు జరుగుతున్నా చాలా మందిలో మార్పు రావడం లేదు. పైనాపిల్ కాలనీ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఒక యువకుడు సెల్ఫీ కోసం ప్రమాదకర ఫీట్ చేశాడు. వేగంగా వెళ్తున్న బైక్ వెనుక సీటుపై నిలబడి సెల్ఫీలు తీసుకున్నాడు. అతడి పక్కనే వెళ్తున్న వారంతా ఆ యువకుడి పడిపోతాడేమో అని ఆందోళన చెందారు. కానీ అతడు మాత్రం స్టిల్స్ ఇస్తూ సెల్ఫీలు తీసుకున్నాడు.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్